జూబ్లీహిల్స్‌లో మజ్లిస్ ప్రచారం

- స్వయంగా రంగంలోకి దిగిన పార్టీ అధినేత ఒవైసీ, ఎమ్మెల్యేలు


షేక్‌పేట్ డివిజన్‌లోని కమ్యూనిటీ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

నార్సింగ్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అధికార కాంగ్రెస్ పార్టీకి ఎంత కీలకమో, మజ్లిస్ పార్టీకి కూడా అంతే కీలకంగా మారింది. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించిన మజ్లిస్ పార్టీ కేవలం అక్కడితో ఆగిపోలేదు. కాంగ్రెస్ పార్టీతో సమానంగా ప్రచార బాధ్యతలు భుజానకెత్తుకుంది. ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్వయంగా రంగంలోకి దిగారు. ఆయన కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇక్కడ విచిత్రం ఏమిటంటే అసుద్దీన్ ఒవైసీతో పాటు మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేలు ఈ ప్రచారంలో పాల్గొంటున్నప్పటికీ అభ్యర్థికి ఓటు వేయమని, బ్యాండ్ మేళాలతో తిరిగి ప్రచారం చేయకుండా వినూత్నంగా వెళ్తున్నారు. మజ్లిస్ పార్టీ తరపున బస్తీ మీటింగ్‌లు, కమ్యూనిటీ మీటింగ్‌లు, మసీద్ కమ్యూనిటీ మీటింగ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ఆ సమావేశాల్లో అసదుద్దీన్ ఒవైసీ, మజ్లిస్ ఎమ్మెల్యేలు స్వయంగా పాల్గొంటున్నారు. షేక్‌పేట్ డివిజన్‌లో ఇటీవల మంత్రుల పర్యటనలో భాగంగా మైనార్టీ ఓటర్లకు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మజ్లిస్ ఎమ్మెల్యేలతో పాటు కాంగ్రెస్ మంత్రులు కూడా పాల్గొన్నారు. ఈ సమావేశాలన్నీ విజయవంతం అవుతుండడం గమనించాల్సిన అంశం. షేక్‌పేట్, ఎర్రగడ్డ, బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్‌లలో మైనార్టీ ఓట్లు అధికంగా ఉన్నాయి. ఒక్క షేక్‌పేట్ డివిజన్‌లోనే 60 వేల ఓట్లు ఉండగా, మిగతా ప్రాంతాల్లో కూడా భారీగా ఉన్నారు. మొత్తానికి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో లక్షా 40 వేల వరకు మైనార్టీ ఓట్లు ఉన్నట్లు అంచనా. మైనార్టీ ఓట్లు అధికంగా ఉన్న డివిజన్‌లకు మజ్లిస్ ఆ పార్టీ ఎమ్మెల్యేలను ఇన్‌చార్జీలుగా నియమించింది. ఇక 60 వేల ఓట్లు ఉన్న షేక్‌పేట్ డివిజన్ ఇన్‌చార్జీగా ప్రచార బాధ్యతలను కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌ను తీసుకున్నారు. షేక్‌పేట్ డివిజన్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్నప్పటికీ కార్వాన్ నియోజకవర్గంతో పూర్తిగా కలిసి ఉంటుంది. షేక్‌పేట్ డివిజన్‌లోని బస్తీలు, కాలనీలు, అలాగే హిందూ బస్తీల్లోని ప్రజలు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌కు సుపరిచితులు. ఆయన చిన్నప్పటి నుంచి ఎక్కువగా షేక్‌పేట డివిజన్‌లోనే పనిచేశారు. దీంతో కౌసర్‌కు ప్రత్యేకంగా షేక్‌పేట డివిజన్ బాధ్యతలను అప్పగించారు. మైనార్టీ ఓట్లు కనీసం 40 వేలు, మరో 30 వేలు హిందూ ఓట్లు సాధించాలని కౌసర్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా ఆయన ప్రతీ రోజు ప్రచారం చేస్తున్నారు. ఇక షేక్‌పేట్ డివిజన్‌పై కూడా ఎంపీ అసుద్దీన్ ఒవైసీ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. మజ్లిస్ అభ్యర్థి ఉంటే ఎలా ప్రచారం జరుగుతుందో ఆ స్థాయిలో ప్రచారం సాగుతోంది.

అక్రమ కేసులతో బీఆర్ఎస్ గెలుపును ఆపలేరు


ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, మల్లారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, ఉపేందర్‌రెడ్డి, మెతుకు ఆనంద్


బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద

వెంగళరావునగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్ గెలుపును ఆపలేరని ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు అన్నారు. రాష్ట్రంలో ఆశించిన మార్పు రాలేదని, రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలకు మిగిలింది నిరాశ మాత్రమేనని వారు పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం యూసుఫ్ గూడ డివిజన్‌లో ప్రచారం సందర్భంగా మధురానగర్ పోలీసులు తనపై అక్రమంగా కేసు నమోదు చేశారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు.

వెంగళరావునగర్‌లో..

బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్‌తో కలిసి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్‌తో కలిసి సిద్ధార్థ నగర్, ఏజీ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు,సీహెచ్.మల్లారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్ రావు, ఉపేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్, తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. మధురానగర్ కాలనీలోని కార్పొరేటర్ దేదీప్యవిజయ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. షేక్‌పేట్ డివిజన్ ఓయూ కాలనీ, పలు ప్రాంతాల్లో జరిగిన సమావేశాల్లో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్, పి.కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఓయూ కాలనీ ప్రాంతంలో ఆటో డ్రైవర్లతో 'చాయ్ పే చర్చ' నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. మారుతి నగర్‌లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు.

బోరబండలో..

ప్రజలు ఆశించిన మార్పు రాలేదని, కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలకు మిగిలింది నిరాశ మాత్రమేనని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బోరబండ డివిజన్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల్లో క్లస్టర్ ఇన్‌చార్జీలు, బూత్ ఇన్‌చార్జీలతో నిర్వహించిన సమావేశాల్లో వారు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేమూరి ధర్మేందర్‌రెడ్డి, మదర్ డైరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి


బోరబండ సైట్-5 కాలనీలో ప్రచారం చేస్తున్న నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


ప్రచారం చేస్తున్న మంత్రి సీతక్క


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పీపీ రవిశేఖర్‌రెడ్డి

బోరబండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు. బోరబండ డివిజన్ సైట్-4, 5, బాబాసైలానీ నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్ యాదవ్‌తో కలిసి సోమవారం వారు ఇంటింటి ప్రచారం చేశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధిని కోరుకునేవారు నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. నవీన్ యాదవ్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి శాయశక్తులా పాటు పడతానని హామీ ఇచ్చారు. కాగా, కృష్ణానగర్ బీ బ్లాక్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి వీజేఆర్ తనయ పి.విజయారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కల్యాణ్ నగర్ వెంచర్ త్రీలో..

ఎర్రగడ్డ డివిజన్ కల్యాణ్ నగర్ వెంచర్ త్రీ పార్కులో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రచారం చేశారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దూడల రవిగౌడ్, రమేష్ నాయక్, నాగళ్ల నరసింహారావు, మతిన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటు అడిగే నైతిక హక్కులేదు

యూసుఫ్‌గూడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పదేళ్లలో జూబ్లీహిల్స్‌లో అభివృద్ధిని విస్మరించిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు లేదని ఏఐసీసీ జాతీయ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.వి.రవిశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం యూసుఫ్‌గూడలో అరకు మాజీ ఎమ్మెల్యే గంగాధర స్వామి, గ్రేటర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. స్థానికుడైన నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు లవకుమార్, సుభాష్ పాల్గొన్నారు.


ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే గణేశ్

బీఆర్ఎస్‌పై ఎన్నికల అధికారికి ఫిర్యాదు

బంజారాహిల్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతతో పాటు ఆ పార్టీ నాయకులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు సోమవారం రిటర్నింగ్ అధికారి సాయిరాంకు ఫిర్యాదు చేశారు. ప్రార్థన మందిరాల వద్ద, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అనుకూల పత్రిక, ఛానెల్ ఇష్టారాజ్యంగా తప్పుడు సమాచారాన్ని ప్రసారం చేస్తూ కాంగ్రెస్‌పై నిందలు వేస్తున్నాయన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎమ్మెల్యే గణేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుస్తుందని తెలియడంతో బీఆర్ఎస్ కుట్ర రాజకీయం చేస్తుందన్నారు. తప్పుడు ప్రచారాలపై అన్ని ఆధారాలను ఎన్నికల అధికారులకు సమర్పించినట్లు చెప్పారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ జాగృతి సోమాజిగూడ డివిజన్ అధ్యక్షురాలిగా లక్ష్మీనారాయణమ్మ


లక్ష్మీనారాయణమ్మ

బేగంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి సోమాజిగూడ డివిజన్ అధ్యక్షురాలిగా మాజీ కార్పొరేటర్ లక్ష్మీనారాయణమ్మ నియమితులయ్యారు. ఈమె నియామకాన్ని సోమవారం జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించారు. లక్ష్మీనారాయణమ్మ గతంలో టీడీపీ కార్పొరేటర్‌గా పనిచేశారు. రాజకీయ పరిణామాల్లో భాగంగా బీఆర్ఎస్‌లో చేరారు. ఇటీవల కవితను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కవిత వెంట నడవడంతోపాటు తెలంగాణ జాగృతి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.


రక్తదాతకు పండ్లు అందజేస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ, పోలీస్ అధికారులు

రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి

యూసుఫ్‌గూడ/ఖైరతాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితులకు, ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని యూసుఫ్‌గూడ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిమ్స్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో బెటాలియన్‌లో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది 102 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నరేంద్రసింగ్, అసిస్టెంట్ కమాండెంట్‌లు రాంబాబు, కె.వి.వి.ప్రసాద్, నర్సింహ, ఆర్ఐలు కృష్ణార్జునరావు, నాగేశ్వరరావు, రాజేష్, సాంబయ్య, రమేష్ బాబు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. సెంట్రల్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన యువకులను సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి సత్కరించారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బేగంపేట/అమీర్‌పేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రజలకు సూచించారు. అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని అల్లావుద్దీన్ కోఠి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఆయన సందర్శించారు. వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల్లో రోగ నిరోధక ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంచడం, సాధారణ ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించే ప్రాముఖ్యతను తెలియజేయడం పట్ల వైద్యుల సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో వైద్యులు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు పుట్టల శేఖర్, ఖలీల్ బేగ్ పాల్గొన్నారు.

ట్రావెల్స్ సంస్థలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

ఖైరతాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ట్రావెల్స్ సంస్థలు తమ బస్సుల్లో విధిగా సీసీ కెమెరాలు, ప్రమాదం జరిగితే అప్రమత్తం చేసే అలారాలను ఏర్పాటు చేసుకోవాలని సైఫాబాద్ ఏసీపీ ఆర్.సంజయ్ కుమార్ సూచించారు. సోమవారం లక్డీకాపూల్ మోడరన్ ఫంక్షన్ హాల్‌లో ఖైరతాబాద్, సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ట్రావెల్స్ సంస్థల నిర్వాహకులు, డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రయాణికుల టికెట్లను బుక్ చేసే సమయంలో వారి గుర్తింపు కార్డులను సేకరించాలన్నారు. బస్సు ఖాళీగా ఉంటే అపరిచితులను మధ్యలో ఎక్కించుకోకుండా వారి గుర్తింపు పత్రాలను పరిశీలించి సరిగా ఉంటేనే అనుమతించాలని సూచించారు. డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగవద్దని హెచ్చరించారు. సమావేశంలో సైఫాబాద్ ఇనెస్పెక్టర్ రాఘవేందర్, డీఐ రాజేందర్, ఎస్ఐలు ప్రణీత్, అహ్మద్ పాషా సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి కోబ్సే వార్షిక సమావేశాలు

పంజాగుట్ట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ ఆఫ్ బోర్డ్స్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా(కోబ్సే) 54వ వార్షిక సమావేశాలు రేపటి నుంచి మూడు రోజులపాటు హబ్సిగూడలోని కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికేట్ ఎగ్జామినేషన్స్(సీఐఎస్సీఈ) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో జరగనున్నాయి. సమావేశాల్లో దేశంలోని వివిధ బోర్డులకు చెందిన ప్రతినిధులు, విద్యావేత్తలు పాల్గొంటారని సీఐఎస్సీఈ డిప్యూటీ కార్యదర్శి డాక్టర్ గోడ్విన్ డానియల్ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంస్థ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డాక్టర్ ఆల్బర్ట్ అబ్రహం, మేనేజర్ సందీప్ జోషీతో కలిసి సమావేశాల వివరాలు వెల్లడించారు. విద్యలో సంస్కరణలు, ఆవిష్కరణలు, సహకారంపై చర్చించనున్నామని తెలిపారు.

చిన్న పరిశ్రమలతోనే దేశ ప్రగతి

బాలానగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చిన్న పరిశ్రమలపైనే దేశ ప్రగతి ఆధారపడి ఉన్నదని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని గీతానగర్, నవజీవన్‌నగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ సభ్యులుగా ఎన్నికైన మధుసూదన్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ క్యాతం వెంకటేశ్వర్లు, కోశాధికారి బి.రవి కార్పొరేటర్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నూతనంగా ఎన్నికైన సభ్యులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సీహెచ్. రాజు, మున్నా, సత్యం, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


యూసుఫ్‌గూడ పోలీస్ లైన్‌లో నేడు జరిగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు
● యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి

మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు

యూసుఫ్‌గూడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదైంది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 26న కాంగ్రెస్ ప్రచార రథం డ్రైవర్ లక్ష్మీనరసింహ నగర్‌లో ప్రచారం నిర్వహించి రోడ్డు పక్కకు ఆపాడు. పాదయాత్రగా వస్తున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో పాటు నాయకులు భాస్కర్, ఫయీమ్, నాగరాజు, రవి, సంతోష్ ప్రచార రథం డ్రైవర్ రమేష్‌కు చేతివేలు చూపెడుతూ దురుసుగా మాట్లాడిన వీడియో ఆధారం చేసుకొని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివకుమార్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్‌లు బైండోవర్

యూసుఫ్‌గూడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి భంగం కలిగిస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన రౌడీషీటర్లపై కఠిన చర్యలు ఉంటాయని మధురానగర్ సీఐ హెచ్.ప్రభాకర్ హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో స్టేషన్ పరిధిలో ఉన్న పాత రౌడీషీటర్లను కొన్ని రోజులుగా బైండోవర్ చేస్తున్నారు. స్టేషన్ పరిధిలోని చిన్న శ్రీశైలం యాదవ్, రమేష్ తన్నుఖాన్, అప్పుఖాన్, అడ్లూరి లక్ష్మణ్, భూపతి పవన్, మురళి, మోహన్‌రెడ్డి, యూనిస్‌తో పాటు మరో పది మందిని ఇప్పటి వరకు బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన డీసీపీ, గన్‌మెన్‌కు పరామర్శ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్ విక్టోరియా గ్రౌండ్స్‌లో రౌడీషీటర్ దాడిలో గాయపడిన సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్, ఆయన గన్‌మెన్ కానిస్టేబుల్ మూర్తిని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు సోమవారం సోమాజిగూడలోని ఓ ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ ఘటనలో వారు చూపిన ధైర్యం, వేగవంతమైన తెగువను ప్రశంసించారు. వారికి ఎప్పటికీ పోలీస్ అధికారుల సంఘం మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.గోపీరెడ్డి, నగర అధ్యక్షుడు నల్ల శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావాలి : డా.లక్ష్మణ్


యూసుఫ్‌గూడలో ప్రచారం చేస్తున్న డాక్టర్ లక్ష్మణ్, జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి

ఎర్రగడ్డ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధిని తెలంగాణలో కూడా అమలు చేయాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ స్పష్టం చేశారు. బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం యూసుఫ్‌గూడలో ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు తెలంగాణను భ్రష్టు పట్టించాయని, రాజకీయాలతో రాష్ట్రాన్ని అప్పులలో కుంగదీశాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మళ్లీ ఎంఐఎం చేయి పట్టుకుని ముందుకు సాగుతోందని తీవ్రంగా మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్‌తో చేసినట్లే ఇప్పుడు ఎంఐఎంను పెంచి పోషిస్తూ సంతుష్టి రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంభాల గంగరాజు, ప్రేమ్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలను తొలగించాలి

- అధికారులకు ఎమ్మెల్యే తలసాని ఆదేశం


తలసానికి వినతిపత్రం ఇస్తున్న సిరి సంపద అపార్ట్‌మెంట్‌వాసులు

అమీర్‌పేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం సమీపంలోని సిరి సంపద అపార్ట్‌మెంట్ కింద ఉన్న షెటర్ల ఎదుట ప్రభుత్వ భూమిలో నిర్మించిన కట్టడాలను వెంటనే కూల్చివేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ టౌన్‌ప్లానింగ్ అధికారులను సోమవారం ఆదేశించారు. సిరి సంపద అపార్ట్‌మెంట్ అసోషియేషన్ నిర్వాహకులు నాయుడు, రాము మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, టీవీఎన్‌రెడ్డితో కలిసి తలసానిని ఆయన నివాసంలో కలిశారు. ఆక్రమణకు సంబంధించిన వివరాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కాగా, అమీర్‌పేట రెవెన్యూ అధికారులు సిరి సంపద అపార్ట్‌మెంట్‌ను సందర్శించారు. గదులను అద్దెకు తీసుకున్న గౌరీశంకర్‌తో మాట్లాడారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు ఎలా చేపట్టావని అడిగారు. తన వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని, భూ ఆక్రమణకు పాల్పడలేదని చెప్పారు. మంగళవారం డాక్యుమెంట్లు ఇస్తానని తెలిపారు. డాక్యుమెంట్లు ఇవ్వకపోతే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

విద్యా వ్యవస్థలో పునాదులు బలంగా లేవు


లోగో ఆవిష్కరించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేడీ లక్ష్మీనారాయణ

బంజారాహిల్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలో పునాదులు బలంగా లేవని ర్యాంక్‌లు మాత్రమే కాదని కాన్సెప్ట్ అప్లికేషన్, ఆలోచన స్వాతంత్ర్యం అవసరమని రిటైర్డ్ ఐఏఎస్ జయప్రకాశ్ నారాయణ అన్నారు. మాదాపూర్‌లోని ట్రిడెంట్ హోటల్‌లో సోమవారం జరిగిన లాయిడ్ గ్రూప్స్ ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ లోగో లాంచ్ కార్యక్రమంలో ఆయన రిటైర్డ్ సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ, సివిల్స్ అకాడమీ చైర్మన్ బాలలతతో కలిసి పాల్గొన్నారు. జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థి తన కాళ్లపై తనే నిలబడేలా చేయడమే నిజమైన విద్య అని అన్నారు. కార్యక్రమంలో లాయిడ్ గ్రూప్ సీఎండీ విక్రమ్ నారాయణ, సంస్థ డైరెక్టర్ మహేష్ కవతేకర్, ధనిక్ భారత్ సంస్థల డైరెక్టర్లు విక్రమ్ అజయ్‌బాబు, విక్రమ్ సురేంద్ర, సీఏ భీముని తిరుపతిరెడ్డి, కందిమళ్ల సాంబశివరావు పాల్గొన్నారు.


గోపాలపురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పాఠశాల విద్యార్థులు

సైబర్ నేరాల పట్ల అవగాహన అవసరం : సీఐ

అడ్డగుట్ట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల విద్యార్థుల్లో అవగాహన ఎంతో అవసరమని గోపాలపురం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధు కుమార్ సూచించారు. పోలీస్ అమరవీరుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజారులోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆదివారం గోపాలపురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులకు లాకప్, నేరాలు చేసే విధానం, క్రైమ్ రికార్డులు ఎలా నమోదు చేయాలని అనే అంశాలను విద్యార్థులకు సూచించామన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, చిన్నపిల్లల చేతిలో ఉన్న సెల్‌ఫోన్లకు వచ్చే ఓటీపీలు చెప్పాలంటూ సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడటం వంటి వాటిపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎస్సై శివరాజుతో పాటు ఎస్సైలు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో మాజీ రైల్వే ఇంజనీర్లు

ఆత్మీయ సమ్మేళనం

చిలకలగూడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ జోన్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఇంజనీర్ల ఆత్మీయ సమ్మేళనం సికింద్రాబాద్‌లోని ఒక హోటల్‌లో సోమవారం నిర్వహించారు. ఎలక్ట్రికల్ విభాగంలో వివిధ శాఖల్లో వీరు పని చేశారు. అనంతరం చనిపోయిన సహచరులకు నివాళులర్పించి, అనాటి అనుభూతులు, అనుభవాలు గుర్తు చేసుకుంటూ, సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమాన్ని కె.వి.ఎస్.సుబ్రమణ్యం, ఎన్.దత్తాత్రేయులు, ఎస్.భాషా, ఎ.వి.ఎస్.ఎస్.ఆర్‌కె. ప్రసాద్ పర్యవేక్షించారు.


సమావేశంలో పాల్గొన్న మాల మహనాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

రణభేరి మహాసభను విజయవంతం చేయండి

అడ్డగుట్ట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సరూర్‌నగర్‌లో నవంబరు 23న జరిగే మాలల రణభేరి మహాసభను విజయవతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య కార్యకర్తలు, అభిమానులకు పిలుపునిచ్చారు. సోమవారం అడ్డగుట్ట ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్‌లో నిర్వహించిన మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడు మేడి శివకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మాలల న్యాయబద్ధమైన హక్కుల సాధన కోసం నవంబరు 23న జరిగే మహాసభను విజయవంతం చేయాలన్నారు. ఇందులో భాగంగా మెట్టుగూడ డివిజన్ నూతన కమిటీని వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, సికింద్రాబాద్ అధ్యక్షుడు నేతల రమేష్, బైండ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జైకుమార్, సత్యనారాయణ, రాంచందర్, జక్కుల లింగం, రాజ్‌కుమార్, రాజేష్, శ్రీనివాస్, లోకేష్, రాము, సత్యనారాయణలు పాల్గొన్నారు.



కార్తీకమాసం

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళీ దేవాస్థానంలో తొలి కార్తీక సోమవారం సందర్భంగా కార్తీక దీపాలు వెలిగించిన ఆలయ ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి దంపతులు.
- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి

గుర్తుతెలియని వ్యక్తి మృతి



అడ్డగుట్ట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మాధవి తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ దేవిక లాడ్జి సమీపంలో గుర్తుతెలియని 50 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానం మహాదానం: డీసీపీ నర్సయ్య


రక్తదాన శిబిరంలో పాల్గొన్న అడిషనల్ డీసీపీ, ఏసీపీలు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రక్తదానం మహాదానమని, ఆపదలో ప్రాణదానం చేసేందుకు ఇది సదావకాశమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ నర్సయ్య పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీలోని నాన్ టీచింగ్ ఫంక్షన్ హాల్‌లో ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి ఆధ్వర్యంలో చిలకలగూడ, ఓయూ డివిజన్లు కలిసి భారీ రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. పోలీసు సిబ్బంది, విద్యార్థులు, పీస్ కమిటీ సభ్యులు, రాజకీయ నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో నాచారం ఓయూ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గణేష్ కూడా రక్తదానం చేశారు. గాంధీ మెడికల్ కాలేజ్ ప్రతినిధుల చేతుల మీదుగా అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ జగన్ ఆయనకు సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఓయూ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

తార్నాక, అక్టోబరు 27 (అంధ్రజ్యోతి): మల్లాపూర్ డివిజన్ అశోక్ నగర్‌లో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కప్పర సాయి కిరణ్ గౌడ్ అధికారులను కోరారు. సోమవారం వాటర్ బోర్డు ఏఈ వేణుగోపాల్‌తో కలిసి అశోక్‌నగర్‌లో పర్యటించిన ఆయన డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైనేజీ పైపులైన్‌లు చిన్నవిగా ఉండటంతో తరచు డ్రైనేజీ సమస్య తలెత్తుందని, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేయాలని అధికారులను కోరడం జరిగిందన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు

● **నార్త్ జోన్ డీసీపీ ఎస్ రష్మీ పెరుమాళ్**



రక్తదానం చేసిన పోలీస్‌శాఖ అధికారులకు, సిబ్బందికి, సభ్యులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న డీసీపీ ఎస్ రష్మీ పెరుమాళ్

మారేడుపల్లి, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా హైదరాబాద్ సిటీ పోలీస్, నార్త్ జోన్ పర్యవేక్షణలో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కాంటినెంటల్, కంటోన్మెంట్ బోర్డు, సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మారేడుపల్లిలోని పద్మశాలి కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిర కార్యక్రమానికి ఉత్తర మండల డీసీపీ రష్మీ పెరుమాళ్ హాజరై జ్యోతి ప్రజ్వలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న కానిస్టేబుళ్ళు ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన పోలీసు సిబ్బందితో పాటు వాలంటీర్లకు డీసీపీ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని అన్నారు. రక్తదానం చేయడం మూలంగా అత్యవసర సమయాలలో ఉన్న వారిన ఆదుకున్న వారవుతారని వెలడించారు. తలసీమియా బాధితులు, డయాలసిస్ రోగులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు అత్యవసర పరిస్థితుల్లో రక్తాన్ని అందించేందుకు ఈ శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులతో పాటు సామాజిక స్పృహ ఉన్నవాళ్లంతా రక్తదాతలుగా రావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు రమేష్, గోపాలకృష్ణ, సైదులు నార్త్ జోన్ పోలీస్ స్టేషన్ల ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటి ప్రతినిధులు, డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి : తలసాని


జబ్బార్ కాంప్లెక్స్ వద్ద ఆటో డ్రైవర్ల సమస్యలను తెలుసుకొంటున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

పద్మారావునగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మాజీమంత్రి, సనత్‌నగర్ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని జబ్బార్ కాంప్లెక్స్ వద్ద కొంత దూరం స్వయంగా ఆటో నడిపిన అనంతరం ఆటో డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చేతకాని హామీలతో ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చాక ఆటో డ్రైవర్లను మోసం చేసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తామని హామీనిచ్చి రెండేళ్లు గడుస్తున్నా నేటి వరకు ఇవ్వలేదని అన్నారు.

ప్రభుత్వ వేధింపుల కారణంగా 161 మంది ఆటో డ్రైవర్లు మరణించారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలనే ఉద్దేశంతో అనేక అమలుచేయలేని హామీలతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై త్వరలో లక్ష ఆటోలతో ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, వెంకటేశన్‌రాజు, ప్రేమ్‌కుమార్,లక్ష్మీపతి, సురేష్, కుమార్ యాదవ్, అబ్బాస్, ఆటో యూనియన్ నాయకులు విజయ్, సాయిలు పాల్గొన్నారు.

శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘృతకుంభాభిషేకం


శ్రీగిరిప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ఘృతకుంభాభిషేకంలో పాల్గొన్న వేద పండితులు

బౌద్ధనగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాస్‌నగర్ శ్రీగిరి పద్మావతి గోదా సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జీర్ణోద్ధరణ పూర్వక మహా సంప్రోక్షణ మహాకుంబాభిషేకంలో భాగంగా సోమవారం ఘృతకుంభాభిషేకంతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితుల నేతృత్వంలో స్వామివారి మూలవిరాట్, ఉత్సవ విగ్రహాలకు పాలు, పెరుగు, తేనెలతో అభిషేకం చేశారు. మొదటిసారిగా మామునిల్ తిరునక్షత్ర ఉత్సవం, కోయిల్ అల్వార్ తిరుమంజనంతో పాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు. గర్భాలయాల్లో గంధం, పచ్చకర్పూరం, కుంకుమపువ్వు, తదితర సుగంధ ద్రవ్యాలతో లేపనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేష్‌కుమార్, కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, తమ్మన వేణుగోపాలరావు, దేవదాయశాఖ స్థపలి వలినాయగం, కమిటీ ప్రతినిధులు బాలభాస్కర్, అత్మరామ సూర్యసుబ్రమణ్యం, లక్ష్మీనారాయణ, శివశంకరన్, నారాయణన్, సుజయ్‌ప్రకాశ్, శ్రీహరి, షణ్ముఖరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దాపురం రమేష్

ఎస్ఆర్ఎస్పీ రెండవ దశకు బీఎన్‌రెడ్డి పేరు పెట్టాలి

రాంనగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : ఎస్ఆర్ఎస్పీ రెండవ దశకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకు డు బీఎన్‌రెడ్డి పేరుపెట్టాలని, సూర్యాపేట జిల్లాకు ఆయన పేరుపెట్టాలని, ఆయన పేరు మీద స్ఫూర్తివనం ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో అఖిలభారత రైతు సమాఖ్య ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమాఖ్య ఉపాధ్యక్షుడు పి.ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దాపురం రమేష్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర కార్యదర్శి జక్కుల వెంకటయ్య, రైతుకూలీ సంఘం అధ్యక్షుడు నర్సింహ, బీ.ఎన్.రెడ్డి కుమారుడు ప్రభాకర్‌రెడ్డి, అల్లుడు మల్లు కపోతంరెడ్డి, ప్రజా సంఘా ల నాయకులు కుమారస్వామి, ఎస్.రెడ్డి, సుకన్య రాగసుధ తదితరులు మాట్లాడారు. ఎస్ఆర్ఎస్పీ రెండవ దశకు మాజీమంత్రి దామోదర్‌రెడ్డి పేరు పెట్టడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. సీఎం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు వెన్నెముక

రాంనగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు వెన్నెముక వంటి వారని టీపీపీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం లలితానగర్‌లో సికింద్రాబాద్ జిల్లా పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు కరణం సురేష్ ఆధ్వర్యంలో సేవాదళ్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సేవాదళ్ బలోపేతం చేయాలని సూచించారు. సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ మాట్లాడుతూ సేవాదళ్ పటిష్టతకు కరణం సురేష్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. హజ్ కమిటీ సభ్యులు ముజీద్, కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు మేడి సురేష్, ఆనంద్ ముదిరాజ్, విజయ్‌యాదవ్, వల్లపురెడ్డి, జయకుమార్, భాస్కర్, పుస్తకాల కవిత, గజ్జెల కవిత, నరేందర్ పాల్గొన్నారు.

శ్మశానవాటికలో ఫాగింగ్

ముషీరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : ఇందిరానగర్ హిందూ శ్మశానవాటిక తదితర ప్రాంతాల్లో సోమవారం జీహెచ్ఎంసీ ఎంటమాలజిస్ట్ సూపర్‌వైజర్ రమేష్ ఆధ్వర్యంలో దోమల నివారణ మందును పిచికారి చేశారు. బోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్ సెకండ్ వెంచర్, సంజీవయ్యనగర్, గుల్షన్‌నగర్‌లో దోమలబెడద తీవ్రంకావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ పేర్కొన్నారు.

పోస్టల్ అధికారిగా అనన్యప్రియ బాధ్యతల స్వీకరణ

రాంనగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ అఫ్ పోస్టల్ అధికారిగా 2022 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ పోస్టల్ సర్వీస్(ఐపీఓఎస్) కవాడిగూడలోని పోస్టాఫీస్ కార్యాలయంలో ఎం.అనన్యప్రియ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సికింద్రాబాద్ డివిజన్ 275 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉందన్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్‌లోని ప్రధాన ప్రాంతాలు తమ పరిధిలోకి వస్తాయన్నారు. తమ డివిజన్ పరిధిలో మూడు హెడ్ పోస్టాఫీసులు, 77 సబ్‌పోస్టాఫీసులు, 226 బ్రాంచి పోస్టాఫీసులు ఉన్నాయన్నారు. వీటి ద్వారా ప్రజలకు మెరుగైన పోస్టల్ సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. డివిజన్ అంతట పోస్టల్ కార్యకలాపాలను బలోపేతం చేయడానికి, సేవా బట్వాడాను మెరుగుపరచడానికి, పౌర కేంద్రీకృత విధానాన్ని పెంపొందించడానికి కృషి చేస్తామని అనన్యప్రియ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెను పోస్టల్ సిబ్బందితో పాటు పలువురు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.


ఉత్తమ ఆధ్యాత్మిక సాంస్కృతిక నాట్య సేవా పురస్కారాలు అందజేస్తున్న శివశ్రీ నిర్మల అంభికానథశర్మ, సంధ్య తదితరులు

నాట్యాచార్యులకు సేవా పురస్కారాలు

నేరేడ్‌మెట్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వినాయకనగర్ డివిజన్ పరిదిలోని కాకతీయనగర్‌లోని శ్రీవాగ్దేవీ సంస్కృతి భారతీ ఆధ్వర్యంలో బాసరలోని కోటి పార్థవలింగ స్తూప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిరంలో సోమవారం ఉత్తమ ఆధ్యాత్మిక సాంస్కృతిక నాట్య సేవా పురస్కారాలు అందజేశారు. ముందుగా జ్యోతిర్లింగ మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమంలో అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన నాట్యాచార్యులు, నాట్యాచార్యుల శిష్యులు పాల్గొన్నారు. శ్రీ భారతీ, శ్రీ సరితశ్రీలకు ఉత్తమ ఆధ్యాత్మిక సాంస్కృతిక నాట్య సేవా పురస్కారాల ను ఆశ్రమ వ్యవస్థాపకులు శివశ్రీ నిర్మల అంబికానాథశర్మ, సంధ్యలు అందజేశారు.

షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీలో పోటీలు

నేరేడ్‌మెట్ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీలో పోటీలు నిర్వహిస్తున్నట్లు నేరేడ్‌మెట్ సీఐ సందీప్‌కుమార్ తెలిపారు. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో ఆన్‌లైన్ షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీలో పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీలలో పాల్గొనేవారు ఈ నెల 31 వ తేదీలోపు షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీలను పంపాలని ఆయన తెలిపారు. పోలీసులకు సంబంధించిన థీమ్ ఉండాలి. వచ్చిన వాటిలో యూనిట్ అధికారులు మొదటి మూడు షార్ట్ ఫిల్మ్‌లను, ఫొటోగ్రఫీలను ఎంపిక చేస్తారు. అనంతరం వారికి మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తారు. యూనిట్ స్థాయిలో ఎంపిక చేసిన వాటిని ఏడీజీపీ, టీజీఎస్‌పీ, బీఎన్ఎస్‌కే పంపుతారు. అక్కడ ఎంపికైన మూడు ఉత్తమ చిత్రాలు, చాయా చిత్రాలకు రాష్ట్ర స్థాయి మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తారని సీఐ తెలిపారు. వివరాలకు పోలీస్ స్టేషన్‌లోను సంప్రదించాలని ఆయన తెలిపారు.

భూగర్భ డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

మల్కాజిగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరిలోని పలు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ అధికారులను కోరారు. సోమవారం జలమండలి కార్యాలయంలో జరిగిన ప్రజావాణికి హాజరైన ఆయన అనేక చోట్ల డ్రైనేజీ నీరు రోడ్లపై పారి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, నాలాలో తీసిన మురికిని వెంటనే తొలగించడం లేదని, మ్యాన్‌హోల్స్ మరమ్మతులు తదితర సమస్యలను జీఎం సునీల్‌కుమార్ దృష్టికి తీసుకవచ్చారు. బోర్‌వెల్ మరమ్మతులు పలు ప్రాంతాల్లో చేపట్టాల్సి ఉందని దీనిపై వెంటనే స్పందించి పనులు పూర్తి చేయాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బేగంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రజలకు సూచించారు. అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని అల్లావుద్దీన్ కోఠి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఆయన సందర్శించారు. వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల్లో రోగ నిరోధక ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంచడం, సాధారణ ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించే ప్రాముఖ్యతను తెలియజేయడం పట్ల వైద్యుల సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో వైద్యులు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు పుట్టల శేఖర్, ఖలీల్ బేగ్ పాల్గొన్నారు.

తెలంగాణ జాగృతి సోమాజిగూడ అధ్యక్షురాలిగా లక్ష్మీనారాయణమ్మ


లక్ష్మీనారాయణమ్మ

బేగంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి సోమాజిగూడ డివిజన్ అధ్యక్షురాలుగా మాజీ కార్పొరేటర్ లక్ష్మీనారాయణమ్మ నియమితులయ్యారు. ఈమె నియామకాన్ని సోమవారం జాగృతి అధ్యక్షరాలు కవిత ప్రకటించారు. లక్ష్మీనారాయణమ్మ గతంలో టీడీపీ కార్పొరేటర్‌గా పనిచేశారు. రాజకీయ పరిణామాల్లో భాగంగా బీఆర్ఎస్‌లో చేరారు. ఇటీవల కవితను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కవిత వెంట నడవడంతోపాటు తెలంగాణ జాగృతి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.



నిరసన వ్యక్తం చేస్తున్న జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

● **జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర రావు**

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా సోమవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర రావుతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.సుమంత్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ కె.స్వాతి మాట్లాడుతూ బకాయిల విడుదల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు విడుదలపై ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి కూడా గ్యారంటీ లేకపోవడం శోచనీయమన్నారు. విద్యార్థి సంఘాలతో, విద్యార్థులతో చర్చించి పూర్తి స్థాయిలో ఓయూ అభివృధికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి మందా సురేష్, నాయకులు అంజి, వెంకటేశ్, ధనుష్, శివ, నవ్య శ్రీ, కళాచారి, రంజిత్, తిరుపతి, పవన్, ప్రణీత, లక్ష్మీ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

ప్రమోషన్ల సమస్యకు పరిష్కారం చూపాలి

● **ఔటా అధ్యక్షుడు మనోహర్**

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సీఏఎస్ ప్రమోషన్ల సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్(ఔటా) అధ్యక్షుడు ప్రొఫెసర్ బి.మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఓయూలోని కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఎదుట అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రమోషన్లలో జరిగిన అవకతవకలపై 24 రోజులుగా నిరసన తెలుపుతున్నామన్నారు. అయినా ప్రభుత్వం స్పందించడం లేదని, వెంటనే నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు లంచ్ అవర్‌లో మాత్రమే నిరసన చేశామని, ఇకపై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సురేష్‌కుమార్, సంధ్యారెడ్డి, పద్మజ, ఎం.వి. రమణారావు, రమేష్, అపర్ణ, మాధురి, శశికళ, సుజాత, పి.రమేష్, నతానియల్, మెలిసా ఎలెన్, వెంకటేశ్వరరావు, మనోహర్ పాల్గొన్నారు.

